# బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు


ఆర్మ్‌స్ట్రాంగ్ మృతదేహం

**రాహుల్, స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల ఖండన ● జీహెచ్ వద్ద కార్యకర్తల రాస్తారోకో ● నేడు చెన్నైకి మాయావతి**

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ఎనిమిది మంది అరెస్టయ్యారు. గత యేడాది ఆగస్టులో జరిగిన ఓ హత్య కేసు నిందితులకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంగానే ఆర్మ్‌స్ట్రాంగ్‌ను దుండగులు హతమార్చినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. అదే సమయంలో హత్యా ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా ప్రత్యేక పోలీసు దళాలు శుక్రవారం రాత్రంతా నగరం నలువైపులా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. దీంతో హత్య జరిగిన 4 గంటల్లోపే హంతకులను గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ఈ హత్య ఘటన కారణంగా ఉత్తర చెన్నైలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హత్యా ప్రాంతం వద్ద, ఆర్మ్‌స్ట్రాంగ్‌ను చికిత్స కోసం తీసుకెళ్ళి గ్రీమ్స్ రోడ్డు అపోలో ఆసుపత్రి వద్ద, అటు పిమ్మట శనివారం ఉదయం ఆయన మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద బీఎస్పీ కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు జరిపారు. వీరిని అదుపు చేయడానికి అప్పటికప్పుడు ఐదువందల మంది దాకా పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఆందోళన చేస్తున్న బీఎస్పీ కార్యకర్తలను కట్టడి చేయడానికి పోలీసులు శనివారం వేకువజాము వరకూ తంటాలు పడ్డారు. కొన్ని చోట్ల స్వల్పంగా లాఠీఛార్జీ చేశారు. ఇక ఈ హత్యను ఖండిస్తూ కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయవతి, అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్, టీవీకే అధినేత విజయ్, డీపీఐ అధ్యక్షుడు తొల్ తిరుమావళవన్, డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రి ఉదయనిధి తదితర నాయకులు ప్రకటనలు జారీ చేశారు. ఇక నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు జరిపిన విచారణలో నెల రోజులపాటు ఆర్మ్‌స్ట్రాంగ్ కదలికలపై నిఘా వేశారని, చివరకు ప్రతిరోజూ రాత్రి 7గంటల ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళుతున్నారని నిర్ధారించుకున్నారు. ఈ వివరాలను ఆ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ తిరుమలై హంతకులకు అందించాడని పోలీసులు విచారణలో గుర్తించారు.

**హత్య జరిగిన తీరు...:** పెరంబూరు బందర్ గార్డెన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్ నివసించేవారు. ఇటీవల ఆ ఇంటిని కూల్చివేసి కొత్తగా బంగళాను నిర్మిస్తున్నారు. తాత్కాలికంగా అయన వరం వేణుగోపాల్ వీధిలో కుటుంబంతో నివసిస్తున్నారు. ప్రతిరోజూ 7 గంటల సమయంలో ఒకరిద్దరు స్నేహితులను వెంటబెట్టుకుని కొత్త ఇంటి నిర్మాణ స్థలానికి వెళ్లి వస్తుండేవారు. ఈ మేరకు ఆర్మ్‌స్ట్రాంగ్ శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఆ స్థలానికి ఇద్దరు స్నేహితులను వెంటబెట్టుకుని వెళ్లారు. కాసేపటికల్లా ఇద్దరు వ్యక్తులు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను సమీపిస్తూ 'అన్నయ్యా' అంటూ పిలిచారు. పార్టీ కార్యకర్తలు తన వద్దకు వస్తున్నారని భావించి ఆర్మ్‌స్ట్రాంగ్ ఎక్కడి నుంచి వస్తున్నారంటూ అడిగారు. ఈలోగా ఫుడ్ డెలివరీ సంస్థ దుస్తులు ధరించి బైకులలో వచ్చిన ఆరుగురు ఆయనపై వేటకొడవళ్లతో దాడి జరిపారు. ఆ సందర్భంగా ఆర్మ్‌స్ట్రాంగ్‌తోపాటు ఆయన అనుచరులపై దుండగులు దాడి జరిపారు. హంతకులు చాలా దగ్గరగా ఈ దాడికి పాల్పడటంతో ఆర్మ్‌స్ట్రాంగ్ మెడకు బలమైన గాయాలవడంతో కుప్పకూలిపోయాడు. ఇక ఆయన బతికే అవకాశం లేదని నిర్ధారించుకున్న తర్వాతే దుండగులు మెరుపు వేగంతో పారిపోయారు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆర్మ్‌స్ట్రాంగ్‌ను అనుచరులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ప్రకటించారు. అప్పటికే ఆ ఆసుపత్రి వద్దకు వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు గుమికూడటంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి పరిస్థితిని అదుపుచేశారు. ఆ తర్వాత అక్కడి నుండి ఆర్మ్‌స్ట్రాంగ్ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పూందమల్లి హైరోడ్డులో పార్టీ కార్యకర్తలు రాస్తారోకో జరిపారు. హంతులకులను కఠినంగా శిక్షించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.


ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద పూందమల్లి హైరోడ్డులో రాస్తారోకో జరుపుతున్న పార్టీ శ్రేణులు

**పాత కక్షలే కారణం...:** ఈ హత్యకు పాత కక్షలే కారణమని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ప్రకటించారు. గతేడాది ఆగస్టులో రౌడీ ఆర్కాడ్ సురేష్ హంతకులకు ఆర్మ్‌స్ట్రాంగ్ సానుకూలంగా వ్యవహరించడం వల్లే ఆ రౌడీ తమ్ముడైన పొన్నన్‌బాలు పథకం ప్రకారం అనుచరులతో కలిసి హత్య చేశారని తెలిపారు. శుక్రవారం వేకువజామునే ఈ హత్యకేసుకు సంబంధించి పొన్నన్‌బాలు, అతడి అనుచరులు రాము, తిరువేంగడం, తిరుమలై, సెల్వరాజ్, మణివణ్ణన్, సంతోష్, అరుళ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పొన్నన్‌బాలును విచారించడంతో హత్యకు గల కారణాలు వెల్లడయ్యాయి. ఆ మేరకు 2015లో బీఎస్పీ నాయకుడు తెన్నరసు పెరియపాళయం వద్ద దారుణహత్యకు గురయ్యాడు. ఆర్కాడ్ సురేష్, ఆయన అనుచరులు ఆ హత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ హత్యా నేపథ్యంలోనే గతేడాది ఆగస్టులో ఆర్కాడ్ సురేష్ పట్టినంబాక్కంలో హతమయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న కొందరికి ఆర్మ్‌స్ట్రాంగ్ సానుకూలంగా వ్యవహరించి న్యాయపరమైన సలహాలు ఇచ్చారని తెలుసుకున్న ఆర్కాడ్ సురేష్ తమ్ముడు పొన్నన్‌బాలు ఆయనపై కక్ష పెంచుకుని పథకం ప్రకారం హతమార్చడని పోలీసుల విచారణలో వెల్లడైంది.



ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న రాథోడ్ - పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

### స్టాలిన్ సంతాపం...

బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు గురైనట్లు తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఆయన మృతి బీఎస్పీ శ్రేణులకు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలకు తీరని లోటని తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డీఎంకే పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పేందుకు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యా సంఘటన ప్రత్యక్ష సాక్ష్యమని ఆరోపించారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీపీఐ నేత తిరుమావళవన్ ఆర్మ్‌స్ట్రాంగ్ మృతి బలహీనవర్గాలకు తీరని లోటని, ఈ హత్యకేసులో నిజమైన దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మక్కల్ నీదిమయ్యం చీఫ్ కమల్, ఎండీఎంకే చీఫ్ వైగో, పీఎంకే అధినేత అన్బుమణి తదితరులు కూడా ఆర్మ్‌స్ట్రాంగ్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటనలు జారీ చేశారు.

**ముందే హెచ్చరించిన పోలీసులు...**

ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రాణాలకు ముప్పు ఉందని, ప్రత్యర్థులు ఆయనను హతమార్చేందుకు పథకాలు రూపొందిస్తున్నారంటూ పోలీసులు ఐదు సార్లు హెచ్చరించారు. అయినా వాటిని ఆర్మ్‌స్ట్రాంగ్ పట్టించుకోలేదు. అనుచరులు కూడా పోలీసులు భద్రత కోసం దరఖాస్తు పెట్టుకోమని ఇచ్చిన సలహాను తోసిపుచ్చారు. ఇక ఎల్లప్పుడూ ఆర్మ్‌స్ట్రాంగ్ లైసెన్స్ కలిగిన రివాల్వర్‌ను వెంటబెట్టుకునేవారు. శుక్రవారం రాత్రి ఆయన తన రివాల్వర్‌ను కారులో ఉంచి కొత్త ఇంటి నిర్మాణ స్థలం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఎప్పటిలా రివాల్వర్ ఆర్మ్‌స్ట్రాంగ్ వద్ద ఉంటే దుండుగులను తుపాకీ చూపి తరిమికొట్టి ఉండేవారని అనుచరులు తెలిపారు.

### నేడు అంత్యక్రియలు...

బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ అంత్యక్రియలు ఆదివారం పెరంబూరులోని పార్టీ కార్యాలయం వద్ద జరగనున్నాయని పార్టీ నాయకులు ప్రకటించారు. ముందుగా పెరంబూరు బందర్‌గార్డెన్‌లో కార్పొరేషన్ స్కూలు వద్ద ఆయన మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. ఇదిలా ఉండగా ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళి అర్పించేందుకు బీఎస్పీ అధినేత మాయావతి ఆదివారం చెన్నైకి విచ్చేయనున్నారు. ఈ విషయాన్ని ఆమె తన ఎక్స్‌పేజీలో ప్రకటించారు. భరించలేని దుఃఖంలో ఉన్న పార్టీ శ్రేణులంతా ప్రశాంతంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. దీంతో ఆమె రాకను పురస్కరించుకుని పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

## క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా డీఎంకే మహా'దీక్ష'

**పాల్గొన్న వివిధ పార్టీల నేతలు ● కేంద్రాన్ని తూర్పారబట్టిన చిదంబరం**

అడయార్, జూలై 6: దేశంలో ఇప్పటివరకు అమల్లో ఉన్న నేర చట్టాల స్థానంలో కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న మూడు నేర చట్టాలకు వ్యతిరేకంగా అధికార డీఎంకే, మిత్రపక్షాల ఆధ్వర్యంలో శనివారం చెన్నైలో మహా నిరాహారదీక్ష జరిగింది. ఎగ్మోర్‌లోని రాజారత్తినం స్టేడియం సమీపంలో జరిగిన ఈ దీక్షా కార్యక్రమానికి డీఎంకే న్యాయ విభాగ కార్యదర్శి ఎన్ఆర్ ఇళంగో సారథ్యం వహించగా, రాష్ట్ర మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. రాష్ట్రమంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యంతో పాటు కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరసన్, ఐఎంయూఎల్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేఎం ఖాదర్ మొహిదీన్, హిందూ సీనియర్ పాత్రికేయుడు ఎన్.రామ్, వీసీకే ప్రధాన కార్యదర్శి తొల్ తిరుమావళవన్‌తో పాటు డీఎంకే మిత్రపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.


శిబిరంలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

**పాత చట్టాలనే కాపీ...**

తొలుత కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కొత్త నేర చట్టాలను తీసుకొచ్చిందని, ఇందులో 90 నుంచి 95 శాతం పాతకాలం నాటి బ్రిటీష్ చట్టాలనే కాపీ చేశారన్నారు. ఈ విషయాన్ని ఎత్తిచూపితే కేంద్రం ఎదురుదాడికి దిగుతోందన్నారు. పాత చట్టాల్లోని 513 సెక్షన్‌లో కేవలం 46 సెక్షన్లలోనే మార్పులు చేర్పులు చేశారన్నారు. మిగిలినవన్నీ యథాతథంగా కాపీ పేస్ట్ చేశారన్నారు. ఇదే విషయంపై చర్చాగోష్ఠినే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఉదాహరణకు 302 సెక్షన్ అంటే హత్యానేరానికి ఉపయోగించేదని చిన్నపిల్లవాడిని అడిగినా ఠక్కున సమాధానం చెబుతారన్నారు. దీన్ని ఇపుడు సెక్షన్ 203గా మార్చారన్నారు. ఇలా అనేక గందరగోళంగా కొత్త నేర చట్టాలను రూపొందించారన్నారు. ఈ చట్టాలను మళ్ళీ ప్రతి ఒక్కరూ అభ్యసించాల్సి ఉందన్నారు. చివరకు కోర్టుల్లో న్యాయమూర్తులు కూడా గందరగోళానికి గురయ్యే అవకాశముందన్నారు. పైగా లోక్‌సభలో విపక్ష సభ్యులందరినీ బయటకు గెంటేసి చట్టాలను ఆమోదించారని ఆరోపించారు. ఈ కొత్త చట్టాల వల్ల బెయిల్ పొందడం అంత సులభతరం కాదన్నారు. సుప్రీంకోర్టులో రోజుకు 100 బెయిల్ పిటిషన్‌లు దాఖలవుతుంటాయన్నారు. ఈ కోర్టుకు వెళ్ళి ప్రతి ఒక్కరూ బెయిల్ తెచ్చుకోవడం అంటే సాధ్యమయ్యే పనికాదన్నారు. చట్టసవరణలు చేసే అధికారం ఉందని, దాన్ని కేంద్రం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ చట్టాలను నిలిపివేసేందుకు న్యాయ కమిషన్‌కు సిఫార్సు చేయాలని చిదంబరం సూచించారు.

**నాలుక తిరగడం లేదు...:** మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ, బీజేపీ తీసుకొచ్చిన మూడు చట్టాల పేర్లను పలికేందుకు కూడా నాలుక తిరగడం లేదని ఎదేవా చేశారు. హిందీ భాషను రుద్దే చర్యల్లో భాగంగానే ఆ చట్టాలకు సంస్కృతం, హిందీ పేర్లను పెట్టారని, అందుకే తాము ఆది నుంచి హిందీని వ్యతిరేకిస్తున్నామన్నారు. సర్వాధికార ధోరణితో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఇతర పార్టీల నేతలు కూడా ఈ చట్టాల గురించి ప్రసంగించారు.


ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ముఖ్యమంత్రి స్టాలిన్

## గిరిజన యువకులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు

**● అందజేసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్**

పెరంబూర్, జూలై 6: గిరిజన కుటుంబాలకు చెందిన 148 మంది యువకులకు దేశ, విదేశాలకు చెందిన సంస్థల్లో ఉద్యోగ నియామక ఉత్తర్వులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. ఆదిద్రావిడులు, గిరిజన సంక్షేమ సంఘ సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం కింద, నెట్టూరు టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్ (ఎన్టీటీఎఫ్) సంస్థ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొంది, దేశ, విదేశీ సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు శనివారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆది ద్రావిడుదుల, గిరిజనులను విద్య, ఆర్థికాభివృద్ధి సాధించేలా ఆదిద్రావిడులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనం, విద్యా రుణాలు, ఉచిత ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నారు. అలాగే, వారి ఆర్థికాభివృద్ధి మెరుగుపరిచేలా వృత్తి శిక్షణ, వ్యాపారాలకు రుణాలు, ఉపాధి అవకాశాలు తదితరాలు కల్పిస్తున్నారు. ఆ ప్రకారం, సమగ్ర నైపుణ్యాభివృద్ధి పథకం కింద రాష్ట్రంలోని కళ్లకుర్చి, ధర్మపురి, సేలం, తిరువణ్ణామలై, నామక్కల్, తిరుచ్చి సహా పలు జిల్లాల్లో గిరిజన వర్గాలకు చెందిన యువతకు డిప్లొమా, ఇంజనీరింగ్, ఐటీఐ, వృత్తి శిక్షణ పొందిన వారికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈమేరకు కొండ గ్రామాల్లో విద్య పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్న గిరిజనులను ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ద్వారా 450 మందితో జాబితా సిద్ధం చేశారు. వారికి తిరుచ్చి, సేలం, చెన్నై జిల్లాల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాల ద్వారా తొలివిడతగా 200 మందిని ఎంపిక చేసి వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించారు. శిక్షణ పొందిన వారిలో 40 మంది మహిళలు సహా 146 మంది వివిధ సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, అభివృద్ధి శాఖ కమిషనర్, ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఆదిద్రావిడులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కె.లక్ష్మిప్రియ, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్నసెంట్ దివ్య, ప్రభుత్వ ఉన్నతాధికారులున్నారు.

## కళ్లకుర్చి ఘటనపై సీబీఐ విచారణ

**బీజేపీ కార్యనిర్వాహక మండలి తీర్మానం ● డీఎంకేని చిత్తుగా ఓడిస్తాం: అన్నామలై**

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్యనిర్వాహక మండలి సమావేశం తీర్మానం ప్రతిపాదించింది. చెన్నై శివార్లలోని వానగరంలో ఉన్న శ్రీవారు వెంకటాచలపతి కల్యాణమండపంలో శనివారం ఉదయం కార్యనిర్వాహక సమావేశం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, ఎల్ మురుగన్, సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, హెచ్.రాజా, చక్రవర్తి, కరునాగరాజన్, నయినార్ నాగేంద్రన్, కరాటే త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో అన్నామలై, కేంద్రమంత్రి మురుగన్, పొన్.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత అన్నామలై అధ్యక్షతన పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశం ప్రారంభమైంది. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర కమిటీ కార్యదర్శి సుధాకర రెడ్డి, చక్రవర్తి, సతీష్‌కుమార్, వినోజ్ సెల్వం, శరత్‌కుమార్, జిల్లా శాఖ నాయకులు మనోహరన్, సుబ్రమణ్య రెడ్డియార్, ఆవడి ఎస్కేఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పార్టీ అభివృద్ధి, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పొందిన ఓట్ల శాతం, ఓటమి గల కారణాలు తదితర అంశాలపై నాయకులు సమగ్రంగా చర్చించారు.

**ఏడు తీర్మానాల ఆమోదం...**

కార్యనిర్వాహక సమావేశంలో ఏడు తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. మూడోసారి మళ్లీ ప్రధాని పదవి చేపట్టిన నరేంద్రమోదీకి శుభాకాంక్షలు, కొత్త మంత్రివర్గంలో ఎల్.మురుగన్‌కు స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. కళ్లకుర్చి కల్తీసారా సంఘటనపై విచారణను సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మరో తీర్మానం ప్రతిపాదించి ఆమోదించారు. ఇదే విధంగా కావేరిపై మెకెదాటు వద్ద ఆనకట్ట, ముల్లైపెరియార్ వద్ద ఆనకట్ట, పాలారుపై ఆనకట్ట అంటూ కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మూడు ఆనకట్టలు నిర్మించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు డీఎంకే ప్రభుత్వం అడ్డుకట్ట వేయకుండా అనుసరించిన నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ మరో తీర్మానం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించినా పట్టించుకోని డీఎంకే ప్రభుత్వ అచేతనాన్ని విమర్శిస్తూ మరొక తీర్మానం చేశారు.


బీజేపీ కార్యానిర్వాహక మండలి సమావేశానికి హాజరైన పార్టీ ప్రముఖులు

**భారీ ఏర్పాటు**

ఇక కార్యనిర్వాహక సమావేశాలకు శ్రీవారు వెంకటాచలపతి కల్యాణమండపంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. పూందమల్లి హైరోర్డు రోడ్డుకు ఇరువైపులా పార్టీ నేతల బ్యానర్లు కట్టారు. ఈ కల్యాణమండపంలో అన్నాడీఎంకే కీలకమైన సమావేశాలు జరపటం ఆనవాయితీ. ఆ పార్టీలాగే రాష్ట్ర బీజేపీ శాఖ కూడా భారీ స్థాయిలో కార్యాచరణ మండలి సమావేశాన్ని నిర్వహించడం విశేషం.

**చిత్తుగా ఓడిస్తా...**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేని చిత్తుగా ఓడిస్తానంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శపథం చేశారు. శనివారం ఉదయం జరిగిన పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో గత మూడేళ్లుగా ప్రజల ప్రాణాలకు భద్రతలేకుండా పోతోందని, శాంతి భద్రతులు క్షీణించాయని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సారా ఏరులై ప్రవహిస్తున్నా ముఖ్యమంత్రి స్టాలిన్ పట్టించుకోవడం లేదని, సారా వ్యాపారాలను సాగించేది అస్మదీయులే కనుక చూసీచూడనట్లు వ్యహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల బీజేపీ శ్రేణులపై డీఎంకే ప్రభుత్వం కేసులు బనాయిస్తోందని, వాటిని చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. రాష్ట్రంలో డీఎంకేని ఓడించేంత వరకూ పార్టీ శ్రేణులు తీవ్రంగా పాటుపడాలని పిలుపునిచ్చారు. 2026లో రాష్ట్రంలో బీజేపీ నాయకత్వంలో రైతు సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని అన్నామలై పేర్కొన్నారు.

## సమాచార ధ్వని

### ఎంటీసీ ఉద్యోగులకు 'బయో మెట్రిక్' తప్పనిసరి

పెరంబూర్, జూలై 6: ఎంటీసీ ఉద్యోగులకు బయో మెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీ జాన్ వర్గీస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లో బయోమెట్రిక్‌లో అటెండెన్స్ నమోదు చేసుకోవాలి. ఉదయం 10.11 నుంచి 11 గంటల్లోపు కార్యాలయానికి వచ్చినట్లు నమోదై ఉండాలి. అంతకు పైబడి వచ్చే వారికి సగం రోజుసెలవు, సాయంత్రం విధులు ముగించుకొని వెళ్లే వారు నమోదు చేయకపోయినా వారికి కూడా సగం రోజు సెలవుగా పరిగణిస్తామని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### మహిళా ఐటీఐలో ప్రవేశం 15న చివరి తేది

పెరంబూర్, జూలై 6: స్థానిక గిండిలోని మహిళా ఐటీఐలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్లకు ఈనెల 15వ తేది చివరి అని ప్రకటన వెలువడింది. ఈ ఐటీఐ అందిస్తున్న కోర్సుల్లో చేరేందుకు విద్యార్థినులకు ఎలాంటి వయోఃపరిమితి లేదు. కోర్సుల్లో చేరే వారికి సైకిల్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్, బస్సు, రైలు పాస్ ఉచితంగా అందించడంతోపాటూ ఉపకారవేతనంగా రూ.750 అందించనున్నారు. అలాగే, అర్హులైన విద్యార్థినులకు 'పుదుమై పెన్' పథకంలో నెలకు రూ.1,000 అందజేయనున్నారు. కోర్సు ఫీజుగా రూ.200 చెల్లించాలని, దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 15వ తేది చివరి రోజు అని ఐటీఐ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

### 9నుంచి పీజీ టీచర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పెరంబూర్, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పీజీ టీచర్లకు ఈ నెల 9 నుంచి నైపుణాభివృద్ధి శిక్షణ తరగతులు జరగనున్నాయి. రాష్ట్ర విద్యలో పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీ టీచర్లు (బోటనీ, జువాలజీ) జూలై 9-13, ఆగస్టు 13.17, నవంబరు 19-23, డిసెంబరు 12-20 వరకు నాలుగు విడతల్లో తరగతులు అందిస్తారు. తొలివిడత శిక్షణ ఈ నెల 9 నుంచి 13వ తేది వరకు స్థానిక నుంగంబాక్కంలోని అన్నశగన్ విద్యా కేంద్రంలో జరుగుతుందని, ఈ శిక్షణలో పాల్గొనాల్సిన ఉపాధ్యాయులకు ఇప్పటికే సర్క్యులర్ పంపించామని అధికారులు తెలిపారు.

### రాష్ట్రంలో 99 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, జూలై 6: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో శనివారం ఉదయం వరకు 99 శాతం అదనపు వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. జూన్ 1 నుంచి శనివారం వరకు 60.5 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 120.5 మి.మీ కురిసిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

### కొమ్మల కత్తిరింపు ప్రారంభం

పెరంబూర్, జూలై 6: నగరంలో మెయిన్ రోడ్లు, అంతర్గత రోడ్ల పక్కన హరిత పథకంలో మొక్కలు సంరక్షిస్తున్నారు. రుతుపవనాల సీజన్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్లు కూలి పడుతున్నాయి. చెట్లు కూలిన సమయంలో ప్రమాదాలు జరగుతున్నాయి. వాటిని అడ్డుకునేలా చెట్ల కొమ్మలు తొలగించే పనులు(ప్రూనింగ్) చేపట్టామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

### అండర్-16 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

పెరంబూర్, జూలై 6: తమిళనాడు క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-16 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 16 నుంచి 21వ తేది వరకు జరగనుంది. 2008 సెప్టెంబరు 1వ తేది నుంచి 2010 ఆగస్టు 31వ తేది లోపు జన్మించి, చెన్నైకు చెందిన వారు మాత్రమే పాల్గొనాలి. చేపాక్కంలో జరగనున్న ఎంపికల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 11వ తేదిలోపు టీఎన్‌సీఏ.జీ లో దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలన అనంతరం ఎంపికకు హాజరుకావాల్సిన తేది, సమయం తదితరాలు వారి ఈ-మెయిల్‌కు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 6: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు (2024) పురస్కారానికి అర్హులైన వారు http://nationalawardstoteachers.education.go-v.inలో ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో జిల్లాలో అర్హులైన టీచర్ల వివరాలను ఎంపిక కమిటీ కేంద్రానికి తెలియజేస్తాయి. ఈ మేరకు ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు త్వరలో పురస్కారాలను కేంద్రప్రభుత్వం అందజేయనుంది.

### పాలిటెక్నిక్ విద్యార్థులకు వృత్తి శిక్షణ

ఐసిఎఫ్, జూలై 6: పాలిటెక్నిక్ విద్యార్థులకు వృత్తి శిక్షణ ఇవ్వాలని ప్రిన్సిపాళ్లకు ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 54 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు సహా 500 ప్రైవేటు పాలిటెక్నిక్‌లు పని చేస్తున్నాయి. ఈ కళాశాలలు టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు మూడేళ్లు, ప్లస్‌టూ ఉత్తీర్ణులైన వారికి రెండేళ్ల డిప్లొమా కోర్సులు అందిస్తున్నాయి. ఈ విద్యార్థులకు కోర్సులు పూర్తికాగానే ఉపాధి లభించేలా వృత్తి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిన రాష్ట్రప్రభుత్వం, పాలిటెక్నిక్ విద్యార్థులకు తప్పనిసరిగా వృత్తి శిక్షణ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

### 15న ఎయిడెడ్ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 6: ఎయిడెడ్ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ జయంతి రోజైన ఈనెల 15న తిరువళ్లూర్ జిల్లా కీలచ్చేరిలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' పేరుతో ఈ పథకాన్ని 2022 సెప్టెంబరు 15వ తేది సీఎం ప్రారంభించారు.ఈ పథకం ద్వారా 1నుంచి 5వ తరగతి వరకు చదివే 15లక్షలమంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలో, ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా ఈ పథకం విస్తరించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ పంచాయతీ యూనియన్ కీలచ్చేరిలో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో ఈ నెల 15వ తేది ఉదయం 8.30 గంటలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ పథకం ప్రారంభించనున్నట్లు సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

### 120 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జూలై 6: నగరంలో ఒకే రోజున 120 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగానికి కొత్తగా నియమితులైన ఇన్‌స్పెకర్ల వివరాలు ఇలా ఉన్నాయి... రాజారామ్(వెప్పేరి), సెల్వకుమార్ (టీపీసత్రం), మోహన్‌దాస్(అన్నాసాలై), ఆనంద్‌బాబు(నుంగంబాక్కం), విమల్(వేళచ్చేరి), భువనేశ్వరి(కాశిమేడు), దేవరాజు(కొరుక్కుపేట), రాజు(వ్యాసర్పాడి), రజనీష్(విల్లివాక్కం) తదితరులు నియమితులయ్యారు.

# నేనే దేవుణ్ణి... అభిషేకాలు చేయండి!

**విగ్రహంపై కూర్చుని ఆలయ స్థలదాత వింత ప్రవర్తన ● అవాక్కైన భక్తులు**

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అందియూరు సమీపం నగలూరులో ఓ ఆలయానికి స్థలమిచ్చిన వ్యక్తి తానే భగవంతుడినని ప్రకటించుకుని తనకు క్షీరాభిషేకాలు చేయమంటూ ఒత్తిడి చేస్తున్న సంఘటన కలకలం సృష్టించింది. అంతటితో ఆగకుండా ఆ వ్యక్తి శయనభంగిమలో ఉన్న మూలవిరాట్టు రంగనాథస్వామిపై కూర్చుని పూజారి చేత క్షీరాభిషేకం కూడా చేసుకున్నాడు. నగలూరులో కలియుగ రంగనాథర్ ఆలయం ఉంది. ఆ ఆలయం కోసలరామన్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో నిర్మితమైంది. నగలూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులంతా ఈ ఆలయాన్ని దర్శిస్తున్నారు. అమావాస్య రోజుల్లో వేల సంఖ్యలో భక్తులు మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఆలయ స్థల దాత కోసల రామన్ ఉన్నట్టుండి తానే రంగనాథస్వామి తానేనని చెప్పుకుంటూ గర్భాలయంలోని స్వామి విగ్రహంపై కూర్చుని తనకు అభిషేకాలు చేయమంటూ అడగటంతో భక్తులందరూ అవాక్కయ్యారు. ఇదిలా ఉండగా మూలవిరాట్టుపై కూర్చుని ఉన్న కోసలరామన్‌కు ఆ ఆలయ పూజారి క్షీరాభిషేకం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై భక్తులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గర్భాలయంలోని మూలవిరాట్టుపై కూర్చున్న కోసలరామన్

## నేటినుంచి విక్రవాండిలో ఉదయనిధి ప్రచారం

పెరంబూర్, జూలై 6: విక్రవాండి శాసనసభ ఉపఎన్నికలో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా ఈనెల 7, 8 తేదీల్లో మంత్రి ఉదయనిధి ప్రచారం చేపట్టనున్నారు. ఈ మేరకు మంత్రి తన ఎక్స్ పేజీలో... 'అందరికీ అన్నీ (ఎల్లోరుక్కుమ్ ఎల్లాం)' అనే ద్రావిడ మోడల్ పాలనలో ముఖ్యమంత్రి స్టాలిన్, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన మార్గదర్శకంలో పని చేస్తున్న డీఎంకే, ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతుతో ఘనవిజయం సాధించిందని తెలిపారు. ఈ విజయ పరంపరలో మరో భాగంగా విక్రవాండి ఉప ఎన్నికలో పోటీ చేయనున్న పార్టీ అభ్యర్థికి మద్దతుగా ఈ నెల 7,8 తేదీల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేలూరు, జూలై 6: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశముందని, అందువల్ల ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ ప్రజలకు సూచించారు. స్థానిక కాట్పాడి రైతు బజార్‌లో శనివారం ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ నేతృత్వంలో వ్యాపారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నుంచి చెత్తను పొడి, తడి చెత్తలుగా విభజించి అందించాలని, బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయరాదని శివకుమార్ సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, సూపర్‌వైజర్ మది, యానిమేటర్లు పాల్గొన్నారు.

## చదురగిరికి పోటెత్తిన భక్తులు



కొండ మార్గంలో భక్తులు

పెరంబూర్, జూలై 6: ఆణి అమావాస్య సందర్భంగా చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి వేలాదిమంది భక్తులు తెల్లవారు జామునుంచే కొండ మార్గంలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆణి నెల ప్రదోషం, అమావాస్య సందర్భంగా పశ్చిమ కనుమల కొండల్లోని సుందర మహాలింగం ఆలయానికి ఈనెల 4 నుంచి 6వ తేది వరకు భక్తులను అనుమతించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు నాలుగు రోజుల్లో పెద్దసంఖ్యలో కొండ ఆలయానికి వెళ్లారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను కొండ మార్గంలోకి అనుమతిస్తామని అటవీ శాఖ ప్రకటనతో, రాత్రికే అక్కడకు చేరుకున్న భక్తులు ప్రవేశద్వారం వేచి ఉన్నారు. రాత్రి వేళల్లో ఆలయం, కొండ ప్రాంతాల్లో భక్తులు బస చేసేందుకు అధికారులు అనుమతించ లేదు.

## గ్లెనీగల్స్‌లో దేశంలోనే తొలిసారి గర్భాశయ మార్పిడి చికిత్స




సెంటర్ ఫర్ ఫీమేల్ ట్రాక్ట్ డిజార్డర్స్ ప్రారంభిస్తున్న దృశ్యం

అడయార్, జూలై 6: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన గ్లెనీగల్స్ హెల్త్ సిటీలో దేశంలోనే మొట్టమొదటిసారిగా గర్భాశయ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ తరహా ఆపరేషన్ నిర్వహించడం భారతీయ ఆరోగ్య సంరక్షణ డొమైన్‌లోనే ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. ఆస్పత్రికి చెందిన ప్రసూతి, గైనకాలజీ, ఫెర్టిలిటీ మెడిసిన్ విభాగ డైరెక్టర్ పద్మప్రియ వివేక్ సారథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 50 విజయవంతమైన గర్భాశయ మార్పిడి చికిత్సలు చేసి మార్గదర్శకుడిగా ఉన్న డాక్టర్ బ్రాన్‌స్ట్రోమ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. పునరుత్పత్తి సమస్యలతో బాధపడుతున్న మహిళలకు కొత్త ఆశను కల్పించడంలో గర్భాశయ మార్పిడి చికిత్స దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఫీమేల్ ట్రాక్ట్ డిజార్డర్స్‌ను చెన్నై నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ ప్రారంభించారు.

## హిష్‌పూర్ వెల్‌నెస్ ఉత్పత్తులను ఆవిష్కరించిన నటి అల్య మానస



హిష్‌పూర్ వెల్‌నెస్ ఉత్పత్తుల ఆవిష్కరణ దృశ్యం

అడయార్, జూలై 6: హిష్‌పూర్ ఇండియాస్ ఉమెన్స్ సీక్రెట్ వెల్నెస్ ట్వంటీ కేటగిరీ ఉత్పత్తులను నటి అల్య మానస చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆవిష్కరించారు. ఈ ఉత్పత్తులను నగరవాసులకు హెరావి పింక్ స్టోర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిచయం చేసింది. ఈ సీక్రెట్ వెల్‌నెస్ ఉత్పత్తులు మహిళల సౌందర్యాన్ని మరింతగా ద్విగుణీకృతం చేసేలా తయారు చేశారు. వీటిని ప్రముఖ బుల్లితెర నటి అల్య మానస ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో హెరావి పింక్ స్టోర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో రాధాకృష్ణన్, మరో వ్యవస్థాపకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. తొలి దశలో దక్షిణ భారతదేశంలో 125 స్టోర్ల కోసం ఫ్రాంచైజీ ప్రారంభించనున్నామని, 2025-26 నాటికి దేశ వ్యాప్తంగా తమ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## సిలబస్‌లో సంప్రదాయ యుద్ధకళలు చేర్చాలి

**● ప్రభుత్వానికి గవర్నర్ సూచన**




కర్రసాము వృద్ధ కళాకారుడు సి.దయాళన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న గవర్నర్ రవి

చెన్నై, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన పాఠ్యాంశాల్లో కర్రసాము, కత్తిసాము వంటి సంప్రదాయక ఆత్మరక్షణ కళలను, యుద్ధ కళలను చేర్చాలని గవర్నర్ ఆర్ఎన్ రవి రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. 'తింక్ టు డేర్' (ముందుకు దూసుకెళ్లేందుకు ఆలోచించు) పేరుతో రాజ్‌భవన్‌లో శనివారం ఉదయం సంప్రదాయ యుద్ధకళల్లో, ఆత్మరక్షణ కళల్లో పేరుగడించిన గురువులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కత్తిసాము, కర్రసాము, బాక్సింగ్ తదితరాల్లో ప్రవీణులైన 50 మందికి అవార్డులిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాచీన సంప్రదాయ కళలను, ఆత్మరక్షణ కళలను భావితరాలకు అందించే దిశగా నేటి యువతరానికి వాటిపై ఆసక్తి కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. రుషులు, సిద్ధులు పెంచి పోషించిన యుద్ధ కళలను పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన పాఠ్యాంశాలలో చేర్చాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇస్తున్నానని చెప్పారు. ముందుగా రాష్ట్రానికి చెందిన, కేరళ, శ్రీలంక, మలేసియా, సింగపూర్లకు చెందిన కళాకారులు కత్తిసాము, కర్రసాము, బాక్సింగ్ ప్రదర్శనలను నిర్వహించి ప్రేక్షకులను మైమరపించారు. కర్రసాము క్రీడా సంస్థ అధ్యక్షుడు ఎస్.సుధాకరన్, ఉపాధ్యక్షులు కే.తిలకవతి, ప్రధాన కార్యదర్శి సీతా మధుమోహన్, రాష్ట్ర బాక్సింగ్ సంస్థ వ్యవస్థాపకుడు కళుమలై చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పారదర్శకంగా విక్రవాండి ఉపఎన్నిక

**● కలెక్టర్ పళని**

అడయార్, జూలై 6: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి ఈనెల 10న జరిగే ఉపఎన్నికలో ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహిస్తామని కలెక్టర్ పళని తెలిపారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 11 మంది, మరో 18 మంది స్వతంత్ర అభ్యర్థులతో కలిపి మొత్తం 29 మంది బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లలో అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులు పొందుపరిచే పనుల్లో ఎన్నికల సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ పనులను కలెక్టర్ పళని సహా రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ... విక్రవాండి ఉపఎన్నిక ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా కౌంటింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

## ఆంధ్ర నుంచి ఇసుక తెచ్చుకొనేందుకు అనుమతించండి

**● సీఎంకు లారీ యజమానుల విజ్ఞప్తి**

పెరంబూర్, జూలై 6: ఆంధ్ర నుంచి ఇసుక తెచ్చుకొనేందుకు అనుమతించాలని కోరుతూ లారీ యజమానుల సంఘం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రికి తమిళనాడు ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఆర్.మునిరత్నం రాసిన లేఖలోని వివరాలు... 'రాష్ట్రంలో పది నెలలుగా ఇసుక క్వారీలు పని చేయడం లేదు. దీంతో సుమారు 75,000 లారీల యజమానులు, డ్రైవర్లు, 10 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇసుక లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ పనులు స్తంభించాయి. ప్రస్తుతం పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఖనిజ శాఖ మంత్రి రవీంద్ర జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన ఉత్తర్వుల్లో... ఈనెల 8 నుంచి 120 ఇసుక క్వారీలు ప్రారంభించాలని ఆదేశించారు. ఆంధ్ర నుంచి ఇసుక దిగుమతి చేసుకొనేలా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి తమిళనాడు ఇసుక లారీ యజమానుల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి అనుమతులు కోరాలి. దీంతో, నగరం సహా అన్ని జిల్లాల్లో భవన నిర్మాణాలు, తమిళనాడు హౌసింగ్ బోర్డు, ప్రైవేటు అపార్ట్‌మెంట్లు, చెన్నై మెట్రో రైలు నిర్మాణం, ప్రజలు గృహాల నిర్మించుకొనేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అందువల్ల లారీ యజమానులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమార్థం సీఎం ఈ చర్యలు చేపట్టాలి' అని లేఖలో పేర్కొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన నిర్వాహకుల ఎంపిక



పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందిస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

వేలూరు, జూలై 6: గుడియాత్తం రోటరీ క్లబ్ 2024-25వ సంవత్సరానికి నూతన నిర్వాహకుల పదవీ ప్రమాణం శనివారం జరిగింది. రోటరీ క్లబ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు వాసుదేవన్ అధ్యక్షత వహించగా, సుకుమార్, తిరునావుక్కరసు తదితరులు పాల్గొన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ కన్నన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేఎంజీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యక్షులు కేఎంజీ రాజేంద్రన్, జిల్లా గవర్నర్ రాజన్‌బాబు, అత్తియూర్ రెహ్మాన్, రాము, జిల్లా మాజీ గవర్నర్ పళని, మదిఅళగన్, మహాలింగం, చేటు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు క్లబ్ తరఫున సామగ్రి అందజేశారు.

## విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



టీఎన్‌పీఎస్సీ పరీక్షల ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు మెటీరియల్ అందిస్తున్న కలెక్టర్

వేలూరు, జూలై 6: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, శిక్షణకు హాజరుకానున్న అభ్యర్థులకు కలెక్టర్ సుబ్బులక్ష్మి మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ అవకాశాలు, శిక్షణ సంస్థ మండల జాయింట్ డైరెక్టర్ దేవేంద్రన్, ఉప డైరెక్టర్లు గాంధీ, సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నామలై విమర్శలు మానకుంటే జైలుభరో

**● అన్నాడీఎంకే నేత ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరిక**



చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేపై అదేపనిగా విమర్శలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీరును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జైలు భరో ఆందోళన జరుపుతామని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరించారు. మదురైలో శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకే దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోందంటూ అన్నామలై మొసలి కన్నీరు కారుస్తున్నారని, పార్టీపై తమకు లేని దిగులు ఆయనకు ఎందుకని ప్రశ్నించారు. అన్నాడీఎంకే అంతర్గత, రాజకీయ వ్యవహారాల గురించి అన్నామలై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అదే సమయంలో పార్టీ శ్రేణులందరికీ మంటపుట్టించే విధంగా ఆయన వ్యవహార శైలి ఉందన్నారు. కోయంబత్తూరు నియోజకవర్గంలో కోట్లు కుమ్మరించినా అన్నామలై గెలవలేకపోయారనే విషయాన్ని మరచిపోయినట్లుందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి తావులేదని, డీఎంకే తర్వాత అధికారంలోకి వచ్చే సత్తా అన్నాడీఎంకేకు మాత్రమే ఉందన్నారు. అన్నాడీఎంకేకు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి రోజురోజుకూ పెరుగుతున్న జనాదరణను చూచి అన్నామలై ఓర్వలేక పోతున్నారన్నారు. ఇకపై అన్నామలై తమ పార్టీని విమర్శిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని, రాష్ట్రవ్యాప్తంగా జైలు భరో ఆందోళనకు దిగుతామని ఉదయకుమార్ హెచ్చరించారు.

### తిరునెల్వేలి జయకుమార్ హత్య కేసు

## మళ్లీ సీబీసీఐడీ విచారణ



జయకుమార్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూలై 6: తిరునల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి అనుమానాస్పద మృతికి సంబంధించి ఆ పార్టీ నేతలను సీబీసీఐడీ పోలీసులు మళ్లీ విచారించనున్నారు. తిరునెల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేబీకే జయకుమార్ గత మే 4వ తేది శరీరం దహనమైన స్థితిలో కరైసుత్తుపుదూర్‌లోని ఆయన గృహం వెనుక తోటలో పడి ఉన్నట్టు విదితమే. ఈ ఘటనలో నిందితులను ఇప్పటివరకు పోలీసులు గుర్తించలేక పోయారు. అనంతరం ఈ కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ అయింది. సీబీసీఐడీ ఎస్పీ ముత్తరసి తిరునల్వేలి వెళ్లి విచారణ చేపట్టారు. పలు కోణాల్లో గాలించినా ఎలాంటి కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో, దిశయన్‌విలైకి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర మానవ హక్కుల విభాగం నిర్వాహకుడు వివేక్ మురుగన్, తూర్పు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మరుదూర్ మణిమరన్‌ను సీబీసీఐడీ అధికారులు రెండు గంటలు విచారించారు. జయకుమార్ సూసైట్ నోట్‌లో పేర్కొన్న పారిశ్రామికవేత్తలు, రాజకీయ ప్రముఖుల గురించి వారిని అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, శనివారం అధికారులు, పోలీసులు అని మొత్తం 30 మంది వ్యాన్, మూడు జీపుల్లో దిశయన్‌విలైకు చేరుకొని విచారణ చేపట్టారు.

## నగదు లెక్కించే యంత్రంలో పాము!



మెషిన్ నుంచి పామును తీస్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 6: స్థానిక ఆవడి సమీపం పట్టాభిరామ్ ఐఎఫ్ రోడ్డు, హిందూ కళాశాల ప్రాంగణంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పనిచేస్తోంది. క్యాషియర్ గదిలో ఉన్న నగదు లెక్కించే యంత్రం నుంచి బుసలు వినిపించాయి. యంత్రాన్ని పరిశీలించిన సిబ్బంది, అందులో పాము ఉండడం గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అంతలో ఆవడి బయోడైవర్సిటీ కన్జర్వేషన్ ఇన్సిస్టిట్యూట్ సిబ్బంది అక్కడకు చేరుకొని, యంత్రంలో ఉన్న పామును బంధించారు. మూడడుగుల పొడవున్న చెటుకురు పాముగా గుర్తించారు. చెట్టు నుంచి స్టోర్ రూం కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించి యంత్రంలో చేరి ఉంటుందని సిబ్బంది అభిప్రాయపడ్డారు.

## మద్యం టెట్రా ప్యాకెట్లతో ఇద్దరి అరెస్ట్



మద్యం బాటిళ్లతో పట్టుబడిన యువకులు

వేలూరు, జూలై 6: గుడియాత్తం నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి నేతృత్వంలో శనివారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా 81 మద్యం టెట్రా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, అన్నామలై, శరవణన్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన నిందితులు

వేలూరు, జూలై 6: పేర్నాంబట్టు సమీపం బద్దలపల్లిలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఆహార భద్రతా శాఖ అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో, శనివారం ఉదయం ఆహార శాఖ క్రైం విభాగం పోలీసులు బద్దలపల్లి దాబా ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాన్ని అడ్డుకొని పరిశీలించగా, అందులో 1,200 కిలోల రేషన్ బియ్యం గుర్తించారు. ఆ బియ్యాన్ని ఆంధ్ర రాష్ట్రానికి తరలిస్తున్నట్లు విచారణలో తెలుసుకున్న పోలీసులు, పేర్నాంబట్టుకు చెందిన పొన్‌రాజ్, మహమ్మద్ ఇస్మాయిల్‌ను అరెస్ట్ చేశారు.

## కార్చిచ్చు నియంత్రణ కేంద్రాలు

ఐసిఎఫ్, జూలై 6: కార్చిచ్చు నివారించడానికి నియంత్రణ కేంద్రాలను అటవీ శాఖ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో జనవరి నుంచి మార్చి వరకు ఏర్పడే కార్చిచ్చులను అడ్డుకొనేందుకు భారత అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, అడవుల్లో మంటలు చెలరేగినప్పుడు వాటిని ఆర్పే దిశగా నియంత్రణ కేంద్రాలను రూ.6.28 కోట్లతో ఏర్పాటు చేయాలని రాష్ట్ర అటవీ శాఖ నిర్ణయించింది.

## పెట్రోలు బంక్‌లో ప్రవేశించిన ఏనుగు



చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం - ఊటీ రహదారిలో ఎన్న ఓ పెట్రోలు బంక్‌లో ఏనుగు చొరబడింది. ఆ ఏనుగు పెట్రోలు బంక్‌లోకి అడుగుపెట్టగానే అక్కడ పనిచేస్తున్న కార్మికులంతా భయంతో నలుదిక్కులా పరుగులు తీశారు. కాసేపు అటూ ఇటూ సంచరించిన ఏనుగు ఆ తర్వాత రహదారి పక్కనే ఉన్న చిట్టడవులలోకి నింపాదిగా నడుచుకుంటూ వెళ్లింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది.

## అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

వేలూరు, జూలై 6: స్థానిక కాట్పాడి సెంగుట్టైలో శనివారం అన్నదానం జరిగింది. ఆర్కే బిల్డర్స్ యజమాని, 1వ వార్డు కౌన్సిలర్ అన్బు అన్నదానం చేశారు. ఆర్కే బిల్డర్స్ తరఫున ప్రతి శనివారం అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రధాన ప్రవేశద్వారం నమూనా

# కొత్త సొబగులతో గిండి రైల్వేస్టేషన్


పార్కింగ్ నిర్మాణాలు జరుగుతున్న దృశ్యం


1,2 ప్లాట్‌ఫాంలపై ఏర్పాటైన రూఫింగ్ షీట్స్

పెరంబూర్, జూలై 6: స్థానిక గిండి రైల్వేస్టేషన్ కొత్త సొబగులతో ముస్తాబవుతోంది. నగరంలో సబర్బన్ రైల్వేస్టేషన్లలో మూర్ మార్కెట్ కాంప్లెక్స్ పార్క్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్, చెన్నై బీచ్ తర్వాత గిండి రైల్వేస్టేషన్ ఉంది. గిండి పరిసర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు, ఐటీ కార్యాలయాలు, అన్నా యూనివర్శిటీ, ఐఐటీ తదితరాలుండడంతో ఈ స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అలాగే, గిండి రేస్ క్లబ్, గిండి నేషనల్ పార్క్, రాజ్ భవన్, గాంధీ మండపం తదితర పర్యాటక ప్రాంతాలకు కూడా ఈ స్టేషన్ ప్రధానంగా ఉంది. ఈ రైల్వేస్టేషన్‌కు ప్రతిరోజు సుమారు 60,000 మంది ప్రయాణికులు వస్తుంటారు. చెన్నై బీచ్ - చెంగల్పట్టు మధ్య ఉన్న ఈ స్టేషన్‌ను 'అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్)లో భాగా రూ.13.50 కోట్లతో ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను సెప్టెంబరు నాటికి పూర్తికానున్నాయని దక్షిణ రైల్వే తెలిపింది.


లిఫ్ట్ ఏర్పాటు పనులు

### ఈ స్టేషన్‌లో ఏర్పాటుకానున్న వసతులు...

- స్టేషన్ ఈస్ట్, వెస్ట్ ప్రవేశద్వారాల వద్ద ఆర్చిల ఏర్పాటు
- కొత్త బుకింగ్ కార్యాలయం
- స్టేషన్ బయట ప్రయాణికుల కాలిబాట
- ఫ్లోరింగ్ కలిగిన ప్లాట్‌ఫారాలు
- అల్యూమినియం కలర్ షీట్లతో పైకప్పు
- ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్
- మూడు లిఫ్ట్‌లు, ఓవర్ బ్రిడ్జి ఆధునికీకరణ
- రైళ్ల సమాచారంతో డిజిటల్ బోర్డులు
- స్టేషన్, ప్రాంగణాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు

నిర్మాణంలో బుకింగ్ కార్యాలయం


# ఒకే ప్రాంగణంలో అన్ని పారంపర్య చికిత్సలు




ఆయుర్వేద చికిత్స

- మదురై ఆయుష్ ఆసుపత్రి ప్రత్యేకత

**దక్షిణ తమిళనాడులో మొదటిసారిగా దేశంలోని సంప్రదాయ వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ధ, యోగా, ప్రకృతి వైద్యం, హోమియోపతి తదితరాలు ఒకే ప్రాంగణంలో అందిస్తోంది మదురై ఆయుష్ ఆసుపత్రి. అన్ని చికిత్సలు ఒకేచోట లభ్యమవుతుండడంతో ప్రజాదరణ కూడా పెరిగింది. అల్లోపతి ఆసుపత్రుల్లో మాత్రమే అన్ని వ్యాధులకు ప్రత్యేక వైద్యులతో చికిత్సలందిస్తుంటారు. అత్యవసర చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు సిద్ధ, ఆయుర్వేదం, హోమియోపతి విభాగాలకు వెళ్లరు. ఈక్రమంలో కేంద్రప్రభుత్వ సహకారంతో 'అముదం సహకారం సంఘం' ఆధ్వర్యంలో రాష్ట్రంలో 'ఆయుష్' ఆసుపత్రి ప్రారంభమైంది.**

**- పెరంబూర్**

SUNDAY SPECIAL


నీటి ధారతో మసాజ్

### ఆసుపత్రి ప్రత్యేకతలు

ఈ ఆసుపత్రిలో ప్రత్యేక అంశాలు ఏమిటంటే, అల్లోపతి ఆసుపత్రిలాగే ఒకే ప్రాంగణంలో ఆయుర్వేద, సిద్ధ, హోమియోపతి, యోగా, ప్రకృతి వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో చికిత్సా విభాగానికి ప్రత్యేక వైద్యులు నియమించగా, వారు రోగికి వైద్య సలహాలు, చికిత్సలు అందిస్తున్నారు. మదురై బైపాస్ రోడ్డు పొన్మేని బస్టాండ్ సమీపంలో ఏడాది క్రితం ప్రారంభమైన ఈ ఆసుపత్రి ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తుంది. నయం కాని వ్యాధులకు సిద్ధులు, పూర్వీకులు అందించిన చికిత్సా విధానాలను అనుసరించి సంప్రదాయ వైద్య విధానాలను ఈ ఆసుపత్రిలో పొందవచ్చు. నడుం నొప్పి, మధుమేహం, ఆస్థమా, కిడ్నీలో రాళ్లు, కీళ్ల నొప్పులు, శరీర బరువు సహా పలు సమస్యలకు ఆయుష్ వైద్యులు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేని చికిత్సలు అందిస్తుండడంతో, ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. బాధితులు కోరుకుంటే, స్టీమ్ బాత్, బనానా లీఫ్ బాత్, మడ్ బాత్, స్పైనల్ బాత్ తదితరాలు ప్రత్యేక ఛార్జీతో అందిస్తున్నారు.

### రూ.150తో నెలంతా...

ఆసుపత్రి వచ్చే రోగులు ఒకసారి రూ.150 చెల్లిస్తే, నెల వరకు ఎన్ని సార్లైనా ఉచితంగా అన్ని రకాల చికిత్సలు పొందవచ్చు. 20 శాతం రాయితీతో మందులు, మాత్రలు అందిస్తారు. ఇలాంటి ఆయుష్ ఆసుపత్రులు మదురై సహా వేలూరులో రెండు ప్రాంతాలు, కోయంబత్తూర్, కుంభకోణం, తిరువణ్ణామలై, ఆంబూరు, కృష్ణగిరి తదితర 10 ప్రాంతాల్లో పని చేస్తున్నాయి. ఈ ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం వేలూరులో ఉంది. వీటి నిర్వహణ డైరెక్టర్‌గా పి.కృష్ణన్ వ్యవహరిస్తున్నారు. ఈ ఆసుపత్రులు 'సౌత్ ఇండియా మల్టీ స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ లిడ్' నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ నిధులతో పని చేస్తున్నాయి.


ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

### మసాజ్‌లు అందుబాటులో...

ఈ విషయమై ఆసుపత్రి నిర్వహణ అధికారి, సిద్ధ వైద్యురాలు దివ్య మాట్లాడుతూ... అవుట్ పేషంట్లకు చికిత్సలు అందించడంతో పాటు తొలిసారి వచ్చే వారికి తదుపరి పద్ధతుల్లో వైద్య సలహాలను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామన్నారు. విదేశాల్లో ఉన్న వారు కూడా ఆన్‌లైన్ ద్వారా వైద్య సలహాలు పొందుతున్నారు. ఆయుర్వేద, యోగా, ప్రకృతి వైద్యం, యునానీ, సిద్ధ, హోమియోపతి తదితర చికిత్సల కోసం ఆసుపత్రులను వెతుక్కొని వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒకే ప్రాంగణంలో అన్ని చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. రోగికి అవసరమయ్యే చికిత్సలను, అతనికి మొదటిసారిగి చికిత్సలందించిన వైద్యుడు సిఫారసు చేస్తారన్నారు. అలా, ఒకే ప్రాంగణంలో తమకు అవసరమైన వైద్య చికిత్సలు వారి శరీర ఆరోగ్యానికి తగినట్లుగా ఉంటాయని తెలిపారు. 70 ఏళ్ల వృద్ధులకు కూడా మధుమేహాన్ని నియంత్రించవచ్చన్నారు. వారికి అవసరమైతే కేరళ ఆయుర్వేద మసాజ్ థెరపీ, మూలికల మసాజ్, ఓటడం, తొక్కనం, పురావలయం తదితర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇలాంటి మసాజ్‌లకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నామన్నారు. ఇతర ఆసుపత్రులతో పోల్చితే ఈ ఛార్జీలు తక్కువగా ఉంటాయన్నారు. శస్త్రచికిత్స అవసరమని చెప్పిన రోగులకు ఆ అవసరం లేకుండా వ్యాధి నయం చేయవచ్చన్నారు. మూలికా మందు, మాత్రలు అందిస్తుండడంతో ఇతర దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. అలాగే, ఈ చికిత్సా పద్ధతిలో తాత్కాలిక పరిష్కారం అని కాకుండా వ్యాధి అంతర్మూలాల వరకు వెళ్లి నయం చేయవచ్చని దివ్య తెలిపారు.


యాషిక ఆనంద్

## తారస్థాయిలో యాషిక ఎక్స్‌పోజింగ్!

తమిళ చిత్రపరిశ్రమలో ఉన్న యంగ్ హీరోయిన్లలో యాషిక ఆనంద్ ఒకరు. ఇటీవల సినిమా అవకాశాలు గణనీయంగా తగ్గాయి. దీంతో ఆమె సోషల్ మీడియాను నమ్ముకుని గ్లామర్ ఎక్స్‌పోజింగ్‌లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ ప్రత్యేక ఫొటో షూట్ చేశారు. ఇందులో తన అందాలను పూర్తిస్థాయిలో ఎక్స్‌పోజింగ్ చేశారు. ఈ ఫొటోలతో పాటు ఓ వీడియోను తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేయగా, ఆమె అభిమానులు అమితంగా లైక్ చేస్తున్నారు. కాగా, యాషికా ఆనంద్ చివరిగా 'పడిక్కాద పక్కంగల్' అనే చిత్రంలో నటించారు.తన 14యేటలోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన యాషిక..2016లో వచ్చిన 'కవలై వేండాం' అనే చిత్రం ద్వారా కోలీవుడ్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించినప్పటికీ వాటిలో ఏ ఒక్క సినిమా ఆమెకు బ్రేక్ ఇవ్వలేదు. దీనికితోడు మహాబలిపురం వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న విషయం తెల్సిందే.

## తాన్య రవిచంద్రన్ ప్రధాన పాత్రలో 'రెక్కై ముళైత్తేన్'

యువ హీరోయిన్ తాన్య రవిచంద్రన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'రెక్కై ముళైత్తేన్'. ప్రముఖ నిర్మాత ఎస్ఆర్ ప్రభాకరన్ నిర్మించగా, ఈ సినిమా తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు 'యూఏ' సర్టిఫికేట్‌ను మంజూరు చేస్తూ, యువతకు మంచి సందేశం ఇచ్చే చిత్రమంటూ సినిమా బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్టోన్ ఎలిఫెంట్ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలను ఎస్ఆర్ ప్రభాకరన్ సమకూర్చి తొలిసారి దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి ఆయన మాట్లాడుతూ... 'ఇది పూర్తిగా కాలేజీ యువత నేపథ్యంలో సాగుతుంది. సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు సైతం ఎంతగానో మెచ్చుకున్నారు. నేను సొంతంగా నిర్మాణ సంస్థను ప్రారంభించి, నిర్మించిన తొలి చిత్రం కావడంతో దర్శకత్వం వహించాను. తాన్య రవిచంద్రన్ ప్రధాన పాత్రను పోషించగా, ఇతర పాత్రల్లో జయప్రకాష్, నరేష్, గజరాజ్, జీవారవి, మీరాకృష్ణన్‌లు నటించారు. మరో ఐదుగురు కొత్త నటీనటులు ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమవుతున్నారు. నేపథ్య సంగీతం తరణ్ కుమార్ సమకూర్చగా, పాటలకు దీసన్ సంగీతం అందించారు. ఈ సినిమాలోని తొలి సింగిల్‌ను త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.


'రెక్కై ముళైత్తేన్'లో తాన్య రవిచంద్రన్

## ప్రతి ఒక్కరి మనసులోని కోపమే 'సేనాపతి'

- దర్శకుడు శంకర్

సమాజంలోని ప్రతి ఒక్కరి మనసులో ఉన్న కోపం, ఆగ్రహావేశమే సేనాపతి పాత్ర అని దర్శకుడు ఎస్.శంకర్ అన్నారు. స్వీయ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా నటించిన 'ఇండియన్-2' ఈనెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని శనివారం చెన్నైలో శంకర్, కమల్, సిద్ధార్థ్ మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో దర్శకుడు శంకర్ మాట్లాడుతూ... 'ఇండియన్' చిత్రం తీసే సమయంలో రెండో, మూడు భాగాలు తీస్తానని కలలో కూడా ఊహించలేదు. ఇన్నేళ్ల తర్వాత రెండో భాగాన్ని తెరకెక్కించడానికి తొలి భాగంలో ఒక సన్నివేశంలో ఇండియన్ తాత పుట్టిన తేదీని వెల్లడించడమే కారణం. వర్మ కళలో వందేళ్ళు పైబడిన సేనాపతి పాత్ర. తొలి భాగంలో కంటే రెండో భాగంగా కమల్ చాలా స్పష్టంగా కనిపిస్తారు. మేకప్‌లో వచ్చిన అధునాతన టెక్నాలజీనే దీనికి కారణం. సేనాపతి పాత్ర ప్రతి ఒక్కరిలో ఉండే కోపం, ఆగ్రహమే. అది ఏంటన్నది వెండితెరపై చూడాల్సిందే. ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు కూడా సినిమా చాలా బాగా వచ్చిందని అభినందించారు' అని అన్నారు. హీరో కమల్ మాట్లాడుతూ... 'ఈ చిత్ర నిర్మాణంలో ఎందరో గొప్ప నటీనటులు ఎంతగానో సహకరించి నటించారు. సినిమా నిర్మాణంలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నాం. సినిమా ప్రారంభించిన తర్వాత చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కొవిడ్ మహమ్మారి, షూటింగ్ సమయంలో ప్రమాదాలు, చిత్రీకరణ నిలిచిపోవడం,న్యాయపరమైన చిక్కులు ఇలా అనేక అవాంతరాలు ఎదుర్కొన్నాం. నిర్మాణంలో ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైన చిత్రం ఇదేనని చెబుతా. చివరగా సినిమాను చూసిన సెన్సార్ సభ్యులు బాగుందని అభినందించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది' అని పేర్కొన్నారు. కాగా, లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్, రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఐశ్వర్య రాజేష్, బ్రహ్మానందం, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, సముద్రగని తదితరులు నటించారు.


విలేకరుల సమావేశంలో శంకర్, కమల్, సిద్ధార్థ్

## రేపు 'వణంగాన్' ట్రైలర్ రిలీజ్

చిత్రజ్యోతి

బాలా దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా నటించిన 'వణంగాన్' చిత్ర ట్రైలర్‌ను ఈనెల 8న సోమవారం సాయంత్రం విడుదల చేయనున్నట్టు హీరో తన ట్విటర్ ఖాతాలో వెల్లడించారు. నిజానికి ఈ సినిమాలో హీరో సూర్య నటించాల్సి ఉంది. బిజీ షెడ్యూల్ కారణంగా ఆయన తప్పుకోవడంతో అరుణ్ విజయ్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో హీరో అరుణ్‌విజయ్ ఒక చేతిలో పెరియార్, మరో చేతిలో వినాయకుడి విగ్రహాలను పట్టుకునివున్నారు. ఈ లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. రోషిణిప్రకాష్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సీనియర్ దర్శకుడు మిష్కిన్ కీలక పాత్రను పోషించారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు. కన్నియాకుమారి, తిరువణ్ణామలై జిల్లాల్లో షూటింగ్ పూర్తి చేసి, నిర్మాణాంతర పనులు పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్టు తన ట్విటర్ ఖాతాలో అరుణ్ విజయ్ వెల్లడించారు.

'వణంగాన్'లో అరుణ్ విజయ్, రోషిణి ప్రకాష్



సదస్సును జ్యోతిప్రజ్వలనంతో ప్రారంభిస్తున్న జోహో కార్పొరేషన్ సీఈఓ శ్రీధర్‌వేంబు

### హృద్రోగ శస్త్రచికిత్సల నైపుణ్యంపై అంతర్జాతీయ సదస్సు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) తమిళనాడు శాఖ ఆధ్వర్యంలో హృద్రోగ శస్త్రచికిత్సల నైపుణ్యంపై జాతీయ సదస్సు స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సును జోహో కార్పొరేషన్ సీఈఓ శ్రీధర్ వేంబు ప్రారంభించారు. తంజావూరు మీనాక్షి హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ గురుశంకర్, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ వి.మురుగేశన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బికేశవమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 1500 మందికిపైగా హృద్రోగ శస్త్రచికిత్స వైద్య నిపుణులు హాజరయ్యారు.

## నేత్ర దృష్టి సంరక్షణపై అవగాహన అవసరం

- హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్ మహదేవన్

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేత్ర దృష్టి సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మద్రాసు హైకోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్ మహదేవన్ అన్నారు. వేలసంఖ్యలో నేత్ర వైద్యనిపుణులంతా రెండు రోజుల సదస్సులో పాల్గొనడం వల్ల వారి చికిత్సానుభవాలు యువ వైద్యులకు స్ఫూర్తి కలిగిస్తాయన్నారు. చెన్నైలో శనివారం ఉదయం రెండు రోజుల ఇండియన్ ఇంట్రాకోక్యులర్ ఇంప్లాంట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జరీ కన్వెన్షన్ (ఐఐఆర్ఎస్ఐ-2004)ను జ్యోతిప్రజ్వలనంతో ఆయన ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి సుమారు 4000 మంది నేత్ర వైద్య నిపుణులు హాజరయ్యారు. ఐఐఆర్ఎస్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ జగత్‌రామ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ అమర్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అవార్డులు, పతకాలు స్వీకరించిన వైద్యనిపుణులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్.మహదేవన్, ఐఐఆర్ఎస్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ జగత్‌రామ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ అమర్ అగర్వాల్ తదితరులు